# త్యాగము

జి. జోగారావు గారు

తన వెనకతలుపు వేసుకుంటూ ప్రసాదరావు గది విడచి వెళ్లిపోయాడు. కుర్చీవదలి అతడు కిటికీదరి నించున్నాడు చల్లని చంద్రకిరణములు గదిలో పడుతున్నాయి అందంగా పెరిగిన సపోటాచెట్టు కొమ్మలు వొకటిరెండు కిటికీ క్రిందపార్శ్వమును రాపిడిచేస్తున్నాయి భవనముముందు పందిరమీద విరియబూసిన మాలతీలత తావుల వెదజల్లుతూంది

కాని అతడు అక్కడ నించున్నదివేరె. ఆభవనం అవతలకేసె వాకట్లో వో మంచముమీద కమల పడుక్కునుంది కమల నాత డిదివరకు అనేకసార్లు చూచుచున్నాడు ఆ మేడమీదనే లీలతో తీవ్రముగా వాదిస్తున్నపుడు ఆమె సౌందర్యమును చూచేడు. లీల హాస్యమునకు ఆమె అమాయిక హృదయము పుష్పంగ 'పకపక' విరగబడి నవ్వినపుడు ఆమె చక్కదనమును పరికించేడు. తన నికృష్ట జీవితమును స్నేహితురాలితో ముచ్చటించుచు చెక్కిళ్లవెంబడి నీరుగార్చిన అప్పటి ఆమె దీనవదనమును చూచేడు నేడు వెన్నెట్లో నిశ్చింతగా ప్రపంచమును మరచి నిద్రించుచున్న ఆమెను నిదానిస్తూన్నాడు తదేకంగా చూస్తున్నాడు అదేపనిగా చూస్తున్నాడు. కాని అతనికి తనివితీరలేదు సన్నంగా పొడుగా తెల్లగా .. నిజానికి కమల అందమైన అమ్మాయి. త్రాచుపాములాటి పొడుగాటిజడ, పెదిమలమీద చిరస్థాయిగ ముద్రింపబడిన చిన్ననవ్వు, ఆమె అవయవసౌష్ఠవము, చూపుల సౌజన్యము, పలుకుల మాధుర్యము—వీటికి పట్టుబడినాడతడు 'నీవు చాలా అందంగావుంటావు' అని రోజుకు పదిసార్లేనా చెపుతూంటాడతడు ఆమెవిని ఆలోచనాపూర్వకంగా వూరుకుంటుంది. ఆమె యేమనుకుంవో అతనికి యెల్లాతెలుస్తుంది?

నాటివుదయమే కమల వొంటరిగా మేడపైకి రావటం. అప్పటివారి సంభాషణ అతడు మరవలా. అతని 'డయిరీ' నాడు చేసుకున్న పుణ్యమది

"నీవు యెంతో అందంగావున్నావు"

" . "

"నేనలా చెపుతూన్నపుడు నీవు నన్నెందుకు అభినందించవు?"

"మీరు నన్ను యెగతాళిచేస్తున్నారు."

"ఎందుకు నువ్వల్లా అనుకున్నావు?"

"నేను నిజంగా అంత అందంగాలేను"

"ఎవరిఅందం వారు చెవుకుంటారేవిఁటి లేకపోతే"

"మీ మాటలయందు నిజమున్నదని మీరు నమ్మకంగా చెప్పగలరా?"

"నా అంతరాత్మ ప్రబోధించినది. నే నన్నాను. అది నిజముకాక అసత్య మెలాగవుతుంది?"

ఆమెమనసులోని సంక్షోభము నాతడుగుర్తించేడు.

"మీరు నా అందంవిషయమై యేమీఅనవద్దు."

ఆమెవెళ్లిపోబోయింది.

అతడామెచేతిని పట్టుకున్నాడు.

"నీవు అందంగావున్నావు అందంగావున్నావన్నాను. నీవు కురూపివైతే అందంగా లేవని చెప్పేవుందును"

"అలా చెపుతారా?"

"తప్పకుండా"

"నా అందమువిషయమై మీకెందుకు?"

"కమలా! నీకింకా తెలవలా, నిన్ను నేను ప్రేమిస్తున్నాను."

ఆమె శూన్యంగా చూస్తూంది తోటకేసి

"నన్ను వదిలేండి"

అతడు వదిలేడు

ఆమె మెల్లగా మెట్లుదిగిపోయింది

అట్టి కమల తనకెదురుగావుందిపుడు అతనికి నిద్ర రాలేదు. ఆ విశాలనేత్రములు రెండు ఆ ప్రేమమూర్తి కేసి నిదానిస్తున్నాయి.

ఊర్లో గడియారం పదకొండు కొట్టినది గదిలో మేజామీదున్న వాచీకేసి అతడు చూచేడు ద్వారము చెంత లీలావతి నించునుంది. అతడు చలించేడు

"కాంతం! ఇంకా నిద్రరాలేదా?"

"లీలా! నీవింత రాత్రివరకు మేలుకున్నావేమి?"

"నాన్నగారు 'ట్రెయిను'కు వెళుతున్నారు అందు చేత మెలకువ వచ్చింది."

"ఇంతవరకు ఆయనతో మాట్లాడుతున్నా. అందు చేత మేలుకొనివున్నాను."

లీల ఆమెవెనక తలుపువేసుకుంటూ గదివదలి వెళ్లి పోయింది.

## ౨

లీలావతి గదివిడిచి వెళ్లిపోయినతర్వాత లక్ష్మీకాంతం పరుపుమీద పడుకున్నాడు.

ఆమె తనతో యింకా యేమోమో మాట్లాడుతుందనుకున్నాడు లక్ష్మీకాంతం కాని లీల వెంటనే వెళ్లిపోయింది ఆమె తన నడతను అనుమానించిందేమో అనుకున్నాడు లీలతో సంభాషణఅంటే అతనికి యెంతో సరదా. లీలావతి అతనికి మేనమామకూతురు. ఆమెకు పదిహేనుయేళ్లు వచ్చేయి. కాని ప్రసాదరావు ఆమెకింకా వివాహము చెయ్యలేదు. లీల ఫోర్తుఫారమ్ చదువుతూంది. ఆక్లాసులోనే కమల ఆమెకు సహాధ్యాయిని లీలాకమలలు వొక యం.ఏ. ని 'ట్యూటరు'గా వేసుకున్నారు. అతడే లక్ష్మీకాంతం మొదట్లో లీల నాతడు వరించేడు. ఆమెను వివాహము చేసుకొనుట కాతడు నిశ్చయించాడు కాని అతనికి కమలతో పరిచయమయింది ఆమె బ్రతుకు తెలివును తెలుసుకొంటూన్న కొలదీ అతని కామెపై జాలి కలిగింది. ఆమె అతని హృదయము నాకర్షించింది. లక్ష్మీకాంతం చలించేడు కమలని తన యెదుట పడ వద్దని లీలతో అనేకసార్లు చెప్పేడు కాని లీలావతి అట్టి ప్రయత్నంచెయ్యలా. కాంతం యేమి చెయ్య గలడు. ప్రకృతి స్వభావ సిద్ధమగు మానవ దౌర్బల్య మునకు లొంగిపోకూడదు కమలను ప్రేమిస్తున్నానని నాటి వుదయమే ఆమెకు తెలియజెప్పేడు. లీల నాతడు బహిష్కరించగలడా?

ఇట్టి విషమస్థితిలో అతనికి ఆలోచనచెప్పేవాళ్లు కూడా యెవరూలేరు. జ్ఞానమువచ్చిన దగ్గరనుంచీ అతడు మేనమామదగ్గరనే వున్నాడు కన్నకుమారుని వలె తన్నువారుచూచి విద్య చెప్పించారు. అట్టివారికి ద్రోహం తలపెట్టడమెలా? లక్ష్మీనరసమ్మ లీలని తనకిచ్చి వివాహం చెయ్యటానిక నిశ్చయించుకుందని అతనికి తెల్సు. ఆవిషయం గురించే ప్రసాదరావతనితో యింతవరకు ముచ్చటించినది. లక్ష్మీనరసమ్మ కాంతంతో లీలపెళ్లి విషయమై మాట్లాడమని భర్తను ప్రోత్సాహించిందానాడు. కాంతంకంటె మంచి వరుడు తమ అమ్మాయికి దొరకదని ఆదంపతుల తలంపు. కాంతం ప్రసాదరావుకి యేంచెప్పగలడు. అతని హృదయ సంక్షోభమును యెవరు గుర్తించ గలరు. లక్ష్మీకాంతం నిశ్చయంగా లీలావతిని ప్రేమించాడు. కాని కమల అతని దృష్టిపథంలో బడింది. అతడు ఆలోచించాడు. కాని ఆలోచన తెగలేదు. 'లీల అభిప్రాయమును కనుక్కొండి' అని చక్కా తప్పించుకున్నాడు ఆనాటికి.

## ౩

కమల లక్ష్మీకాంతాన్ని వరించిదని లీలావతికి తెలుసు. లీలకూడ కాంతాన్ని ప్రేమించింది. కాని

'అదికాదు' అని చెప్పటానికి ఆమె సాహసించలేక పోయింది తన్నిట్టి క్లిష్టపరిస్థితుల్లోపెట్టిన కమలపై గాని, కాంతంపైగాని ఆమెకు క్రోధంలేదు వారి కలయికకై ఆమెప్రయత్నం అందుకే ఆమెకు ఆతృత

* * *

తెల్లవారితే లీలావతివివాహం. కమలకుటీరము బాగా అలంకరింపబడ్డాది తల్లితోకూడ కమల ఆనాడే తన స్నేహితురాలికడకు వెళ్లిపోవచ్చింది. ప్రసాదరావు వివాహమునకింతయు సిద్ధముచేసికొని మేడమీద వసారాలో 'news paper' చదువు తున్నాడు. వెనుకనుంచే లీల అతని శిరోజముల నిమిరినది

"ఏవమ్మా యిల్లావచ్చేవు ?"

"ఏమీలేదు."

ప్రక్కనున్న సోఫాలో ఆమెకూర్చుంది

"నాన్నగారూ! లీలకిపుడే వివాహమువలదు."

"ఏమి ?"

"కమల కాంతమునువరించింది"

"అయితే ?"

"అతడామెకు ప్రేమభిక్షపెట్టేడు."

ప్రసాదరావు నిశ్చలంగా వూరుకున్నాడు.

"నాన్నగారూ! కాంతం మీమాట జవదాటడు. కాని కమల నాతడు వివాహముచేసుకోటం నా యిష్టం. కమల కష్టజీవిని నాకు పెండ్లికాదని మీకు భయమా ? నాజీవితముకు పాడుచేసుకుంటున్నా నను కోకండి. ఒకవేళ పాడుచేసుకొన్న కమలసుఖిస్తుంది. నా కంతేచాలును."

బొటనవ్రేలితో నేల రాస్తూ లీలావతి వూరుకుంది. అంతకంటె ఆమె యేమిచేస్తుంది. ప్రసాదరావు తీవ్రంగా ఆలోచించాడు. కాంతంవంటి భర్త లీలకి మళ్లాదొరకడని ఆత డనుకున్నాడు. కాని కమల నాతడు కన్నకూతురు మల్లేమాస్తూన్నాడు.

'లీలా! కాంతం కమలని వరించాడని నీకు తెలుసా?'

"తెలును. అత డామెను స్వీకరించుట కట్టి ఆటంకముచెప్పడు"

"లీలా! రేపు కమలకేవివాహము."

తండ్రి నుదుటినిముద్దాడి లీల అప్పుడే లోనికి పరిగెత్తింది కాంతంతో చెప్పటానికి. మొట్టమొదట ఆమెకుకనబడింది కమల

"ఏ మాతొందర ?"

"కాంతం యెక్కడున్నాడో తెలుసా ?"

"వారిగదిలో"

"నీవుకూడరా నావెనక."

గదితలుపుత్రోసి యిద్దరూ లోనప్రవేశించేసరికి కాంతం ఆ కిటికీదగ్గరనించుని వున్నాడు.

"కమలకిపెళ్లి -"

"వరుడు ?"

అతడు వెనుదిరిగి ప్రశ్నించేడు.

"లక్ష్మీకాంతం"

"హాస్యమా ?"

"కాదు నాన్నగారి వాగ్దానము"

అతడు నమ్మలేదు

కమల అంతకన్నా నమ్మలేదు

కాని లీల యెందుకు అసత్యంచెపుతుంది వారి చూపులు యేకమయేయి అదిచూచి లీలావతి సంతుష్టి జెందింది. అచటనుండి ఆవలికిపోయింది.

"నీవు యెంత అందంగావున్నావు" ఆమెబుగ్గలు యెర్రబారినై. అతడు ముగ్ధుడయ్యేడు ఆమెనుచూచి.